# మిథ్యాబింబం

సుజాత రిక్షా దిగి నాలుగు మెట్లెక్కి అరుగుమీదికి రావటం-గోడగడియారం పది కొట్టటం ఒక్కసారే జరిగాయి. తలుపులు రెండూ బార్లా తీసి ఉన్నాయి. మెర్క్యురీ లైటు మాత్రం వెలుగుతూంది. లోపల ఎలాంటి అలికిడీ లేదు. చేతిలో ఉన్న లెదర్ బాగ్ కసికొద్దీ బరువెక్కినట్టనిపించింది. అడుగు పెట్టగానే సోఫాలో కూర్చుని కునికిపాట్లు పడుతున్న సీతాయి కనిపించింది.



ఎర్రగా ఉన్న కళ్లు కోపంతో ఇంకా ఎరుపెక్కాయి. పళ్లు పటపట కొరుకుతూ రెండు మూడుసార్లు "సీతాయి!" అని పిలిచింది. పెద్ద కొండను చిన్న గునపంతో కదపటం సాధ్యం కాదని తెలిసినా ఎందుకో ఆ నిజాన్ని మరిచిపోయింది. గబగబా వెళ్లి టేబుల్ మీదున్న స్టీలు ప్లేటు గోడవారకు విసిరింది. నిశ్శబ్దంగా ఉన్న ఆకాశంలో హఠాత్తుగా ఉరుములు ప్రతిధ్వనించినట్టు ప్లేటు గగ్గోలుపడింది. సీతాయి మేలుకుంది.

ఆమెకెదురుగా కనపడింది సుజాత కాదు. అప్పుడప్పుడూ పదాల్లోనూ, గుళ్లోనూ దర్శనం ఇచ్చే కాళికామ్మవారు!

"ఏమే? ఇదేమన్నా ఇల్లనుకున్నావా? సత్రవనుకున్నావా? తలుపులు తెరిచిఉన్నాయి. ఏ దొంగైనా వస్తేనో? పాపం! అతగాడు చీకట్లో ఎక్కడ తడుములాడుకుని ఏ చెయ్యో, కాలో తెగ్గోసుకుంటాడోనని చక్కగా దీపం వెలిగించి మరీ నిద్రపోతున్నావు! నీలాంటి అజాగ్రత్త మనిషిని, సోమరిపోతును పెట్టుకున్నందుకు నన్ననుకోవాలి కానీ, నిన్నని ఏం లాభం? నాకు పూర్తిగా నచ్చావు కానీ, రేపట్నుంచి దయచెయ్యి!" అని అరిచింది.

తుపానుకు మొక్కలా సీతాయి గడగడలాడింది. "అమ్మగారు దరమదేవత మనింటో దొంగపడ్డానికి గుండెలుండొద్దూ? అదీకాక పిల్లకి పొద్దుట్నుంచీ చుఖం లేదు. ఆ ఇసారంతో కునుకట్టేంది. మీరు పొమ్మంటే ఎక్కడకు పోతాం తల్లీ? పొరపాటు!" అంటూ లెంపలు వాయించుకుంది.

**శ్రీ ఆర్.ఎం.చిదంబరం**

సుజాత మనసు క్షణంలో కరిగిపోయింది. ఓ సంఘటన నిజంగా జరిగినప్పుడు కలిగే కోపం, 'ఇలా, ఇలా' జరుగుతుందని ఊహించుకుంటే కలిగే కోపం కంటే చాలారెట్లు పదునైంది.

"సరే, ప్రకాశం తగలడ్డాడా లేదా?"

"అబ్బాయిగారాండి?" అని సాగదీసింది గోడకేసి చూస్తూ.

వంటింటోకి వెడుతుంటే నిలువుటద్దం ఎదురైంది. అనుకోకపోయినా, అనిష్టమైనా దానిముందు నిలబడి ఒక్కసారి తన్ను చూసుకుంది. ముంగురులు చెదిరిపోయాయి. కళ్లెందుకో లోతుకుపోతున్నాయి. ఆనాటి బడలికంతా కనురెప్పలమీద కూర్చుని కిందికి జారడానికి ప్రయత్నిస్తోంది. ఎంత పోషణ లేకపోయినా ఆమె సౌందర్యం దాగి ఉండలేకపోయింది. సుజాత అసహ్యించుకునేది ఆ సౌందర్యాన్నే-ప్రయోజనం లేని ఏ వస్తువూ ఉండకూడదని ఆమె వాదం.

ఈ అయిదు నిమిషాల్లో తన ప్రవర్తన తలుచుకుని ఆశ్చర్యపోయింది. డాక్టరుకు కావలసింది ఓర్పు, పెదవులమీద చిందులాడే చిరునవ్వు. అలాంటిది తన సహనాన్ని చీల్చి చెండాడి అమానుషంగా ప్రవర్తించింది. ఎందుకు? పగలంతా విశ్రాంతి లేకుండా రోగులకు సేవ చేసినందుకా? కాదు. అలా ఎన్నో రాత్రులు తను మేలుకుని ఉండి, తనలో గుప్తమైన ఉత్సాహం పైకి చిమ్మింది కానీ భూమిలోకి దారి వెతుక్కోలేదు. సీతాయి తలుపులు తెరచి నిద్రపోయినందుకా? అసలే కాదు! తనింటోకి ఏ దొంగా రాడనీ, వచ్చినా తీసుకుపోయేందుకు



కుర్చీలూ, సోఫాలూ మాత్రమే ఉన్నాయనీ ఆమెకు తెలుసు. మరి? ప్రకాశం తిరిగి రానందుకా? అతను వస్తాడని తను ఎదురుచూడలేదుగా! మరి... మరి... తనలో ఎందుకీ అశాంతి? ఏదో లోపం ఉంది. కారణరహితంగా ఏ వ్యక్తీ చీకాకు పడడు. ఎక్కడో హృదయంలో ఓ మూల జనించే కోపం పరవళ్లు తొక్కుతూ తప్పుదారిలో వెడుతూంది.

సుజాత వంటింటోకి వెళ్లింది. కారియర్‌లో అన్నం చల్లారిపోతోంది.

"అమ్మగారూ! నేనింటి కెళ్లిరానా? దానికెలా ఉందో మరి? ఆడొక్కడే ఏం చేస్తాడు?" అంది బెదురుతూ సీతాయి. ఆమె మళ్లీ

విరుచుకుపడుతుందేమోనని భయం!

"సరే! నాకాకలి లేదు. భోంచేయను. కారియర్ తీసుకెళ్లు!" టెలిఫోన్ గణగణ మోగింది.

సుజాత రిసీవర్ అందుకుంది. మొహం ఎర్రబడింది.

"సారీ మిస్, సుజాతా! గంట క్రితం ఫోన్ చేశాను. మీరక్కడ లేరని తెలిసింది. డిస్పెన్సరీకి కారు పంపాను. ఆరింటికే మూసేసి ఎక్కడికో వెళ్లారట. చూడండి, ఒక్కగా నొక్క చెల్లెలు. పద్దెనిమిదేళ్లు దానికి. అల్లారుముద్దుగా పెంచాం. మా ఇంటో అదంటే అందరికీ పంచప్రాణాలు. ఇదే మొదటి కాన్పు. దాని మొగుడు బొంబాయిలో పురుడు జరిపిస్తానన్నాడు కానీ మేమే బలవంతాన తీసుకొచ్చాం. అందుచేత మీరు వెంటనే రావాలి. నొప్పులు ప్రారంభమవుతున్నాయి. నర్సు వచ్చిందనుకోండి... కానీ ఎందుకో మీవంటి అనుభవం ఉన్నవారు దగ్గరుంటే ఏ చింతా ఉండదు. ఇది జీవితంతో పోరాటం!"

అతని ప్రతిమాటలోనూ ఉన్న బాధనూ, ఆందోళననూ సుజాత చిత్రించుకుంది. అతని కళ్లూ, మొహం-శరీరంలో ప్రతి అణువూ ఆందోళనపడుతూ ఉండాలి. ఆమె హృదయం నవనీతంలాంటిది. "ఇదుగో, వస్తున్నా!" అన్న మాటలు నాలుక చివరదాకా వచ్చి జన్మస్థానాన్ని వెదుక్కున్నాయి. చీకటిగదిలో ఉన్న అహంకారం వెలుగులోకి వచ్చి గర్జించింది. "సారీ, చాలా అలసిపోయాను. ఒంట్లో బాగాలేదు. నర్సు ఉందిగా! నాకంటే ఆమెకే ఈ విషయంలో ఎక్కువ అనుభవం ఉంటుంది. అంతా సవ్యంగా జరుగుతుంది. క్షమించండి!" అని రిసీవరు కింద ఉంచింది. మరో నిమిషానికి టెలిఫోన్ మళ్లీ గణగణమంది కానీ ఆమె దానివంకైనా చూడలేదు.

"ఈ అమ్మ వెర్రిబాగుల్ది-బతకటం సేతకాదు!" కారియర్‌తో వెడుతూన్న సీతాలు అనుకుని నవ్వుకుంది.

అతను ప్రపంచంలో డాక్టర్లందర్నీ ఖరీదుకు కొనగలడు. తను కాకపోతే మరొకరు. తనెందుకు లొంగిపోవాలి? సుజాత బిస్కెట్లు తిని, పాలు తాగింది. కిటికీలోంచి దూరంగా వెలుగుతూన్న దీపాలవంక చూసింది.

జీవితాన్ని గురించి ఆలోచనలు రాకూడదు కానీ వస్తేమాత్రం అంతులేకుండా సాగిపోతాయి. ఎడారులు, కొండలు, లోయలు, నందనోద్యానవనాలు-అన్నీ ఎదురవుతాయి.

ఒక అబద్ధాన్ని నమ్మి పదేపదే అనటం వలన అదే నిజమవుతుందని షేక్స్‌పియర్



ప్రతిపాదించాడు. సుజాత నమ్మిన నిజానిజాలు కూడా అంతే. ఆమె ఎందుకో డబ్బున్నవాళ్లను ద్వేషించింది. సుజాత తండ్రికి పాతికెకరాల పొలం ఉంది. ఆయన దృష్టిలో ఆత్మాభిమానం, కీర్తి, ధనం, స్నేహితం-అన్నిటికంటే ఓ మెట్టుపైన ఉంటుంది. భార్య పోగానే మళ్లీ పెళ్లి చేసుకోకుండా ఆమెనూ, ప్రకాశాన్నీ తల్లి లేని లోపం లేకుండా పెంచాడు. ప్రకాశం మరీ తెలివైనవాడు కాకపోయినా దండయాత్రలు చేయకుండా చదువుకుంటూ వచ్చాడు. సుజాత స్కూలు ఫైనలు పరీక్ష రాస్తూండగా పెళ్లిసంబంధం నిశ్చయమైంది. పెళ్లికొడుకు స్కూలు ఫైనలు మూడుసార్లు తప్పాడు. ఉద్యోగం లేదు. అందుకోసం అతను ప్రయత్నించవలసిన అవసరం కూడా లేదు. తాతముత్తాతల ఆస్తి బోలెడుంది. ఒక్క ముసలితల్లి మాత్రం మార్గదర్శినిగా మిగిలింది. తెలిసీతెలియని ఆ ప్రాయంలో కూడా ఆమె వేసుకున్న పథకాలు వేరు-భర్తతో చేయీ-చేయీ కలుపుకుని సినిమాకు వెళ్లాలి. అతను ఆఫీసు నుంచి తిరిగి వస్తుంటే తను చిరునవ్వుతో స్వాగతం ఇవ్వాలి. ఇంకా ఎడారిలో ఇసుకకణాల్లా ఇలాంటి ఆలోచనలు ఎన్నో! ఆమె 'అంగీకారం' ఎవరూ అడగలేదు. కుటుంబగౌరవం దృష్టితో చూస్తే ఈ పెళ్లిలో ఎలాంటి లోపమూ లేదు.

ఈ కథను ఆంధ్రప్రభ
సచిత్రవారపత్రిక 8.4.1959
సంచికలో ప్రచురించాము.

పెళ్లి స్థిరపడింది. జరిగిపోయింది.

"ఆ సంఘటనతోనే అర్థం చేసుకోవలసింది" అనుకుంది సుజాత.

ప్రకాశం జాడ కనిపిస్తుందేమోనని కిటికీలోంచి ఆ చివర నుండి ఈ చివర వరకూ దృక్కులు వ్యాపింపచేసింది.

"తెలిసినా చేసేదేముంది?" అని మళ్లీ ప్రశ్నించుకుంది. ఆ సమాధానం ఆమెకు కొద్దిగా తృప్తినిచ్చింది.

ఊరేగింపుతో భోగంమేళం ఉండాలని పెళ్లికొడుకు పట్టుబట్టాడు. అంతా విస్తుపోయినా, చేసేది లేక రాత్రికిరాత్రి అన్ని ఏర్పాట్లూ చేశారు. అదో సరదా కింద అర్థం చేసుకున్నారు.

కాపరానికి వెళ్లిన తరువాత తెరవెనక సంగతి అర్థమైంది. పదులూ, వందలూ జూదంలో ఎగిరిపోయేవి. ఉన్నట్టుండి ప్రయాణమై టౌనుకు వెళ్లి రెండు మూడురోజుల తరువాత ఎర్రటికళ్లతో




పారేసుకున్న వస్తువును వెదుక్కుంటూ వచ్చేవాడు. సహనం హద్దులు దాటేవరకూ ఊరకుండి ముసలి అత్తగారితో చెప్పుకుని ఏడ్చింది.

"అయ్యో... బాగుంది! మగాడన్న తరువాత నాలుగు చోట్లకు వెళ్లకుండా ఉంటాడా? నీ కొంగట్టుకు తిరగాలంటావా?" అంటూ మొదలుపెట్టేది.

అతని కోరికకు విరుద్ధంగా కేవలం కట్నం కోసం ఈ పెళ్లి జరిగింది. ఓనాడు రాత్రి తాగి వచ్చి సుజాతను కొట్టాడు. ఆమె మూలంగా తన స్వేచ్ఛ హరించుకుపోతోందనీ, మర్యాదగా

వెళ్లకపోతే పీక పిసికి 'సఫా' చేస్తాననీ బెదరించాడు. గత్యంతరం లేక తండ్రికి ఉత్తరం రాసింది.

సుజాత తండ్రి వచ్చాడు. సంగతి సందర్భాలు మాట్లాడుకున్నారు. ముసలావిడ సుజాత తన సంసారంలో నిప్పులు గుమ్మరించిందని అట్టహాసం చేసింది. ఆరోజే సుజాత తండ్రితో ప్రయాణమైంది. రైలు స్టేషనుకు మైలు దూరం నడవాలి. బండి కుదరలేదు. కాలినడకనే బయలుదేరారు. నుదుటిమీద కుంకంబొట్టు-మృదుత్వంతో కన్నీరు కారుస్తున్న కళ్లు-తనకోసం జీవితాన్ని బలిచేసినందువల్ల చిక్కిపోయిన శరీరం-ఓ చేతిలో చిన్న సంచీ-మరో చేతిలో ఏనాటినుండో నమ్మినబంటులా సేవ చేస్తున్న చింకి గొడుగు. నాన్న మౌనంగా ముందుకు సాగిపోతుంటే సుజాత వెంబడించింది. తనలో ఉన్న లోపం ఏమిటి? అందం లేదా? ఈ ఊళ్లో ఉన్న సమవయస్కులకు తన సౌందర్యంలో ఉన్న ఓ కిరణం కూడా లేదు. సంస్కారం? దాని హద్దుల్ని నిర్ణయించే శక్తి ఆమెకే ఉంటుంది. నియమబద్ధమైన జీవితానికలవాటుపడిన ఆమెలో శుచీ, శుభ్రతా, అనురాగం-ఆదర్శం- అన్నీ పరిపూర్ణత పొందాయి. కానీ అర్థం చేసుకోలేని ఒక్క హృదయం ఆమెను చీకటిలో బంధించింది. అశాంతి, అహంకారం- నిట్టూర్పు- ఎడారి బతుకు లోయను పూడ్చివేశాయి. అదే క్షణంలో తనలాంటివారు చాలామంది ఉంటారనుకుంది. అన్నీ ఉండి తనతన్ని ఆకర్షించలేకపోయింది. అతనిక్కావలసినదాని కంటే ఎక్కువ డబ్బుంది.



పనీపాటా అక్కర్లేదు. శరీరశ్రమంటే ఏమిటో తెలియదు. శరీరంలో ప్రతి అణువూ బాధ్యతను గుర్తించి కష్టపడి పనిచేయనప్పుడు మెదడు కళ్లెం తెగిన గుర్రంలా ఆలోచనలు చేస్తూ ఆ లోటును భర్తీ చేస్తుంది. ఎడారిలా వ్యాపిస్తున్న కాలాన్ని గడపటానికి మార్గాలు సృష్టిస్తుంది. దాని ఫలితమే ఈ దుర్వ్యసనాలు-మోతాదుకు మించిన ఈ డబ్బే లేకపోతే అందరికిమల్లే అతను కూడా జీవనోపాధికోసం కష్టపడేవాడు. ఆనాటినుండి ధనవంతులంటే అసహ్యం-ద్వేషం-వీలైతే వగ సాధించాలన్న కోరిక! ఎందుకో-ఏమో-అదో పెద్ద నవ్వులాంటిది. దానికి విమర్శలూ, వ్యాఖ్యానాలూ అక్కర్లేదు.

సుజాత కాపురం అంతరిక్షంలో కలిసిపోయినా తండ్రి మాత్రం అధైర్యపడలేదు. ఒకసారి మనసులు విరిగాక మళ్లీ కలుసుకోవు. ఇల్లూ వాకిలీ అమ్మేసి ఆ డబ్బుతో టౌనుకు వచ్చారు. సుజాత ఎం.బి.బి.ఎస్. పూర్తిచేసింది. ప్రకాశం అయిదోఫారంలో అడుగుపెట్టాడు. సుజాత తండ్రి పైకి గంభీరంగా ఉన్నా, లోపల కుమిలిపోతూనే ఉన్నాడు. ఆరోగ్యం క్షీణించింది. ఓనాడు చిరునవ్వుతో కన్నుమూశాడు. ఆరేళ్ల క్రితమైతే సుజాత బెదురుతూ ప్రపంచం వంక చూస్తూ ఏడ్చేది. తను ధైర్యంగా నిలబడి పయనిస్తున్న అందాల మబ్బు మంచుకణమై, నీటికణమై, ఆవిరై గాలిలో కలిసిపోయినందుకు విలపించేది. కానీ ఈనాడు ఆమె అంతా తెలుసుకుంది. దేన్ని చూసీ తను వణకనవసరం లేదని గ్రహించింది.

టౌన్‌లో డిస్పెన్సరీ తెరిచింది. దిక్కులేక తిరుగుతున్న అదృష్టం ఆమె స్నేహితం కోసం తహతహలాడింది. మూడునాలుగేళ్లల్లో ఆమె పేరు అందరిలోనూ మన్ననలు పొందింది. డబ్బున్నవాళ్లను పీడించి వసూలు చేసినా బీదవాళ్లకు చేతిడబ్బు పెట్టి చికిత్స చేసేది. ఆమె కీర్తికీ, ఔన్నత్యానికీ ఎవరూ అడ్డు రాలేదు. ప్రకాశం బి.ఏ.లో చేరాడు.

సమస్యలకు అంతంటూ ఉండదు. ఒకదానికి సమాధానం వెతికేలోగా మరోటి ఎదురవుతుంది. తనకు వివాహం కాలేదు. అతను బతికిఉన్నాడో లేదో, ఏం చేస్తున్నాడో తనకు తెలియదు. ప్రకాశం ఉన్నతస్థితికి రావాలి. నాన్నగారి అడుగుజాడల్లో నడుచుకోవాలి. అదే చివరకు మిగిలిన ఆశయం!

కానీ అనుకున్నట్టు ఏదీ జరగలేదు. ప్రకాశం కాలేజీలో చేరినప్పట్నుంచి దుష్టసహవాసంతో కొత్త జీవితం ప్రారంభించాడు. చెయిన్ స్మోకింగ్ అతని ఉబుసుపోకల్లో ఒకటి. ప్రతిరోజూ ఓ సినిమా-సుజాత ఎలాగో సహించింది. ఓనాడు ప్రిన్సిపాల్ ఆమెను పిలిపించి అతని సాహసకృత్యాలను వర్ణించారు. కాలేజీలో అమ్మాయిలకు ప్రేమలేఖలు రాయటం-వాళ్లవెంట వెకిలి చేష్టలు చేస్తూ తిరగటం ఒకటి రెండుసార్లు మరీ చనువుగా ప్రవర్తించి చెప్పుదెబ్బలు తినటం... ఇంక ఆమె



వినలేకపోయింది. అతన్ని డిస్మిస్ చేయదలచినట్టు చెప్పేసరికి నిలువునా నీరైపోయింది. బతిమాలుకుని, ఫైను చెల్లించి ఆత్మగౌరవాన్ని నిలువుకుంది.

నేరారోపణంతా విన్నాక ప్రకాశం సమాధానం ఇచ్చాడు. "అక్కయ్యా! అనవసరంగా నన్నేమీ అనకు. నేను చేసింది చిన్న తప్పైనా చెవులూ, ముక్కులూ తగిలించి కొండంత చేసి నీకు నూరిపోస్తున్నారు. నువ్వు నమ్మితే నమ్ము -నాకభ్యంతరం లేదు. నన్ను శిక్షించేందుకూ, సరిదిద్దేందుకూ నీ కర్తృత లేదు. పొద్దునన్నగా వెడుతున్నావు. అర్ధరాత్రి, చిత్తం వచ్చినట్టు తిరిగితిరిగి వస్తావు. ఏమేం చేస్తున్నావో, ఎక్కడెక్కడకు వెడుతున్నావో నాకేం తెలుసు? నీ గురించి కూడా లక్ష కథలు చెప్పుకుంటారు. ఆడదానికే అంత సాహసమైతే మగవాడికుండదూ? ఒకరి మాటలు నేను నమ్మను కాని, శ్రీపతితో నువ్వు షికార్లు వెళ్లటం నేను కళ్లారా చూశాను."

సుజాత కోపంతో కంపించింది. ఆవేశంతో ఆ దవడా ఈ దవడా వాయించి అతన్ని మెడపట్టుకుని గెంటివేసి, "ఛీ! నా గుమ్మం తొక్కకు!" అనరిచింది.

అతను తిరిగి రాలేదు కూడా.

శ్రీపతి! అవును, అతనికీ, తనకూ ఏమిటి బంధం? ఇందాక రమ్మని ఫోన్ చేశాడు కూడా. తనతో చనువుగా ఉంటేనే తను పైకి రాగలుగుతుంది. మనసులో ఏ కల్మషమూ లేదు.

శ్రీపతి లక్షాధికారి. తారాజువ్వలా లేస్తున్న అడ్వకేట్ కూడా. సంపాదన అలా ఉంచి, పూర్వీకుల ఆస్తి బోలెడుంది. అతని తల్లికి అరవై ఏళ్లు దాటాయి. రెండు మూడు సంవత్సరాలుగా కడుపులో ఏదో నొప్పి-డాక్టర్లు చూసి ఆపరేషన్ చెయ్యాలని అభిప్రాయపడ్డారు. అందుకామె 'ససేమిరా' ఒప్పుకోలేదు. చివరకు శ్రీపతి సుజాతను తీసుకువచ్చాడు. కొమ్ములు తిరిగిన సర్జన్లకంటే తనకెక్కువ మేధ లేకపోయినా అది, అల్సర్ల మూలాన కావచ్చునీ, వరుసగా ఇంజక్షన్లు ఇస్తే తగ్గవచ్చునీ చెప్పింది. ఆమె ముఖం చూడగానే శ్రీపతి తల్లికి దివ్యతేజస్సుని చూసినట్లయింది. సుజాత చిరునవ్వులోనూ, ఓదార్పులోనూ తియ్యటి పంచదార తింటున్నట్లయింది. మూడు నెలల్లో ఆమె బాధనుండి విముక్తి పొందింది. సుజాత కూడా ఆశ్చర్యపోయి ఆ కేసు తాలూకు వివరాలన్నీ డైరీలో రాసుకుంది.

రోజుకు రెండుసార్లు అయినా శ్రీపతి సుజాతను కలుసుకునే అవసరం ఏర్పడేది. అతని కళ్లల్లో ఉండే చిరునవ్వు ఆమె హృదయంలో ఓ విధమైన అనుభూతినీ, విప్లవాన్నీ రెచ్చగొట్టినా మరుక్షణం అణుచుకుని క్రమంగా తుడిచివేసేది. ఇంజక్షన్లు ఇవ్వటానికి అతని కార్లోనే ప్రతిరోజూ వెళ్లేది. శ్రీపతి తనను గురించి ఏమనుకుంటున్నాడని ఆమె ఎన్నడూ ఆలోచించలేదు. అతనెప్పుడూ వెకిలిచేష్టలు చేయలేదు. కుండ బద్దలు కొట్టినట్టు చెప్పకపోయినా తన్ను ప్రేమిస్తున్నట్టు మాత్రం గ్రహించుకుంది.

"మిస్ సుజాతా! మీరు టెన్నిస్ ఆటకు రావాలి!" అంటూ ఓనాడు ఆహ్వానించాడు. 'మిస్' అన్నమాట గుండెలో లోతుగా దూసుకుపోయింది. నిజం అతనికి తెలిసి ఉంటే? వెళ్లకూడదనుకుంది. కానీ ప్రవర్తన మాత్రం అందుకు విరుద్ధం!

ఆ రాత్రి క్లబ్బు నుండి తిరిగి వచ్చాక రాత్రంతా ఆలోచించింది. శ్రీపతి రమ్మనగానే తనెందుకు వెళ్లింది? ధనవంతులమీద తనకు సహజంగా ఉండే ద్వేషం శ్రీపతి విషయంలో ఏమైంది? మగవాళ్ల మూలంగా పడిన అవస్థ చాలదూ? ఎందుకో తెలియకుండా ఏడ్చింది.

అనుకోకుండా బోలెడు సంఘటనలు జరిగిపోయాయి. అన్నీ జోడించి, కల్పించి ప్రకాశానికెవరో పురెక్కించి ఉంటారు. పత్రికలో ప్రకటనలు వచ్చాయి. కోపం తగ్గాక అతనికోసం కుమిలిపోయింది. రెండు వారాలు గడిచాయి కానీ అతని జాడ తెలియలేదు.

గడియారం ఒకటి కొట్టింది.

సుజాత నిద్రలో ఉంది. దీపాలు వెలుగుతున్నాయి.

"అమ్మగారూ!" అని కిటికీ దగ్గరగా వచ్చి పిలిచింది సీతాయి.

సుజాత కళ్లు నులుముకుంది.

"అమ్మగారూ! పిల్లదానికి నొప్పులు మొదలెట్టాయి. వేగిరం రండి!"

రెండే నిమిషాలు-పైపు దగ్గర నీళ్ల చప్పుడు. మెడిసిన్ ఛెస్ట్ తెరవటం, మూయటం, స్లిప్పర్లు తొడుక్కోవటం-తలుపు తాళంపడ్డ చప్పుడు.

మెట్లు దిగి కిందకు రాగానే ఆమెను అడ్డగిస్తూ సర్రున కారు వచ్చి ఆగింది.

"ఇందాక మళ్లీ ఫోన్ చేశాను. జవాబు రాలేదు. అందుచేత నేనే వచ్చాను. డాక్టర్! మీరు కనికరించాలి. కేసు చాలా ప్రమాదకరమైందని నర్సు అంటోంది. మీరు రాకపోతే చెల్లాయి బతకదు!" విషాదం-ఆందోళనా-వెయ్యిశాఖలు వేసి అతని మొహాన్ని కప్పివేశాయి.


సుజాత అటు చూసింది.

చలితోనూ, మానసికదౌర్బల్యంతోనూ గడగడ వణుకుతున్న సీతాలు. మోకాలిదాకా రంగు పోయిన చీరరవిక మీద లక్ష కుట్లు-చింపిరి తల. నిస్సహాయత-శ్రీపతికి మరో డాక్టరుని రప్పించే సమర్థత ఉంది.

"నేను వస్తున్నాను, మీరు వెళ్లండి!" అంటూ రిక్షాలో సీతాయితో వెళ్లిపోయింది. పది గజాలు వెళ్లాక నాలిక్కరచుకుంది. తను 'వస్తుం'దని చూస్తాడేమో! ఆలోచించేందుకు అవకాశం లేదు. సీతాయి ఇల్లు వచ్చేసింది. మనవడు పుట్టాడు. శ్రీపతి ఇంటికి వెళ్లాలన్న ఆలోచన ఆమెకు కలగనేలేదు.

అయిదారు రోజులు గడిచాయి.

విజిట్‌కి వెడుతున్నప్పుడు ఒకటి రెండుసార్లు



శ్రీవతి ఎదురయ్యాడు. అతనిలో ఎలాంటి మార్పూ లేదు. మామూలుగా విష్ చేశాడు.

రాత్రి తొమ్మిది గంటలు.

సుజాత టేబుల్ మీద పుస్తకాలన్నీ సర్దింది. ఆవేళెందుకో ఆమెకు గదంతా తీర్చిదిద్ది ఎక్కడి వస్తువులక్కడ ఉంచాలనిపించింది. చిందరవందరగా పడి ఉన్న బట్టలన్నీ తీసి చక్కగా మడతపెట్టింది. బీరువాలో సామానంతా సర్దాక ఆ ఎర్రపెట్టె తెరిచింది. రకరకాల ఆలోచనలు- అందులో ఉండవలసిన నెక్లెసు కనపడలేదు. నాన్నగారు పెళ్లినాడు ముచ్చటగా కొనిచ్చింది. వెర్రెత్తినట్టు బీరువా అంతా గాలించింది. డ్రాయర్లో ఉన్న పుస్తకాలూ, కాగితాలూ అన్నీ విసిరికొట్టింది. లేదు. ఎక్కడా లేదు!

జాగ్రత్తగా ఆలోచించింది. ఎవరు తీసి ఉంటారు? తనింటో లేనప్పుడు ఒక్క సీతాయి తప్ప మరెవరూ లేరు. తలుపులు వేసుకుని నెమ్మదిగా ఆ చీకట్లో బయలుదేరింది. ఐదేళ్లుగా సీతాయి ప్రవర్తనను అనేకకోణాల్లోంచి పరిశీలించింది. దొంగతనం చేసే అవకాశం లేదు...

గుడిసెలో చిన్నదీపం వెలుగుతోంది. ధైర్యంగా లోపలకు వెళ్లలేకపోయింది. తలుపు తట్టడానికి వేళ్లు ముందుకు సాగాయి. నూతిలోంచి మాట్లాడుతున్నట్టు సంభాషణ వినిపించింది.

"అమ్మాయిగార్ని మా బాగా వల్లే కొట్టించావే! అసలు బుర్రంటే నీది. నీకు కాసులమాల చేయించాలి సుమా!"

"ఉష్... ఊరుకో! అది నేనెత్తుకొచ్చానని తెలిస్తే, పీక తీసేస్తుంది. అయినా ఆమె ఎర్రిబాగుల్తి. బీదోళ్లను ఇట్టే నమ్ముతాది-మరి దీన్ని అమ్మే యిదానం సూడు, తొందరగా!"

"నోరు మూసుకో! గట్టిగా అరవమాక!"

కెవ్వుమని ఏడుపు. గుసగుసలు. అంతే, ఆ రెండో కంఠం సీతాయి అల్లుడిది. ఆ తరువాత చీకటి దట్టంగా అలుముకుంది. సుజాత అర్థమైనట్టు తల వంకించింది.

తలుపు దభాలున తోసింది. ఇద్దర్నీ చెడామడా తిట్టి నెక్లెస్ లాక్కుంది. పోలీసులకు కబురంపింది.

ఈ దృశ్యాలు ఆమె ఊహలో మెదిలాయి. కానీ అలా జరగలేదు. కింది పెదవి కొరుక్కుంటూ మెట్లు దిగింది. ఒక్క క్షణంలో అనుబంధాల్ని తెంపుకోవచ్చు- కానీ మళ్లీ బతకలేం.

టెలిఫోన్ గంట గణగణ-

రిసీవరులో శ్రీవతి కంఠం-అసహ్యంతో కింద ఉంచాలనుకుంది కానీ ప్రకాశం పేరు దొర్లింది.

"మిస్ సుజాతా! క్షమించాలి. ప్రకాశం మా పక్కింట్లో దొంగతనానికి జొరబడ్డాడు. పోలీసుకు తెలియజేసే ముందు మీకు తెలియచేద్దామని ఫోన్ చేశాను. వెంటనే రండి!" ఆ కంఠంలో కర్కశత్వం-ప్రతీకారం-ఏవీ లేవు. సౌమ్యంగా, బాధ్యతాపూరితంగా ఉంది.

సుజాతను చూడగానే ప్రకాశం తల వంచుకున్నాడు. శ్రీవతీ, మరి నలుగురూ ఉన్నారు.

ప్రకాశం రెండు శక్తుల మధ్య ఇరుక్కున్నాడు. ఒకటి, తను చేసిన పని నీచమైందని అంతరాత్మ ఘోష-రెండు అతను అలవాటు పడిన జీవితం తాలూకు విషసర్పాల బుసలు-దుబారాగా ఖర్చుపెడుతూ జల్సాగా తిరిగే మనసు ఒక్కసారిగా చీకట్లో దరిద్రంలో బతకటానికి ఒప్పుకోదు. తన ఆశలు పూర్తి చేసుకునేందుకు ఎలాంటి మార్గమైనా వెతుకుతుంది. తరువాత పశ్చాత్తాపపడవచ్చును కానీ ఆ క్షణంలో మాత్రం విచక్షణ ఉండదు. ఆమె ప్రకాశాన్ని క్షమించింది.

"నడు ఇంటికి!" అంది ప్రేమతో-విషాదంతో.

అరుగుమీద కొచ్చేసరికి శ్రీవతి "ఆగండి!" అంటూ వచ్చాడు. "ఒక్కమాట! మీరు నన్ననవసరంగా అనుమానించారు. ధనవంతులందరూ మనసు లేనివారనుకున్నారు. అది పొరపాటు-మనుషుల మనస్తత్వాలు డబ్బునుబట్టి మారుతాయని నేననుకోను. ఒకరకం జీవితానికీ, దృక్పథానికీ అలవాటు పడిన వ్యక్తిని డబ్బు మార్చలేదు. అలా మారే పక్షంలో ఆ వ్యక్తి ప్రతి చిన్న విషయానికీ మనస్తత్వాన్ని మార్చుకుంటాడు. ప్రకాశాన్ని జైలుకు అప్పగించి మీ మీద పగ తీర్చుకోవచ్చు. కానీ నేనలా చేయలేదు. మీ మెప్పు పొందుదామని కాదు. ఎందుకో నా మనసు ఒప్పుకోలేదు- మిమ్మల్ని ప్రేమించిన మాట నిజం. కానీ మిమ్మల్ని పాడుచేద్దామనీ, పెళ్లి చేసుకుందామనీ కాదు. మీ నిరాడంబరజీవితం నన్నాకర్షించింది. అందుకే... ఆలస్యమవుతూంది, వెళ్లిరండి!"

రిక్షా చక్రాలు పైకీ కిందకూ పడుతూ లేస్తున్నాయి. సుజాత తన అభిప్రాయాలను సరిదిద్దుకోసాగింది. తన భర్త డబ్బుండటం వలన క్రూరంగా ప్రవర్తించాడు కనక అందరూ అలాగే నడుచుకుంటారనుకోవటం పొరపాటనిపించింది. సీతాయి తన్ను మోసగించలేదూ? ఆమెలో మాత్రం నీతీ-నిజాయితీ ఎక్కడ ఉన్నాయి?

ఇల్లు చేరుకున్నారు.

సుజాత అద్దం ముందు నిలబడి తన్ను తాను పరీక్షించుకుంది. ముంగురులు చిందరవందరగా ఉన్నాయి. కళ్లు అలసటతో మూతలు పడుతున్నాయి. అయినా మనసులో ఏదో తృప్తి-ఆర్ద్రత. కానీ, ఆనందం-చిన్నగా నవ్వింది. తరువాత ఆశ్చర్యంగా చూసింది. ఎందుకిదంతా? శ్రీవతిని పెళ్లి చేసుకోబోతున్నందుకా?

అసలు మళ్లీ పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకుందా ఏం?

ఏమో! ఆడవాళ్ల మనసులు సముద్రం కంటే లోతైనవట-ఎవరికేం తెలుస్తుంది? అంతా అయోమయంగా ఉంది. ■

